# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 19 సంచిక : 74 | ఆదివారం 16, నవంబర్ 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



MHR TV




# రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ

జూబ్లీహిల్ కొత్త ఎమ్మెల్యే నవీన్ యాదవ్ హాజరు

సమావేశానికి హాజరైన భట్టి, మహేశ్ గౌడ్

జూబ్లీహిల్స్ విజయం, రాష్ట్ర రాజకీయాలపై ప్రధానంగా చర్చ

త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలపైనా చర్చ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీతో ఢిల్లీలో సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కీలక సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, జూబ్లీహిల్స్ నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఈ భేటీకి హాజరయ్యారు. ప్రధానంగా జూబ్లీహిల్స్ గెలుపు, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై నేతలు చర్చించినట్లు సమాచారం. దీంతో పాటు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చించినట్టు తెలుస్తోంది.జూబ్లీహిల్స్ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డిపై పార్టీ అధిష్ఠానం అసంతృప్తితో ఉందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ కావడం ఆ ఊహాగానాలకు తెరదించినట్లయింది. ఈ సమావేశం ద్వారా పార్టీలో నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉందని అధిష్ఠానం సంకేతాలు పంపినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డిని కలిసిన విన్ గ్రూప్ ఆసియా సీఈవో

ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి

తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటుకు విన్ గ్రూప్ ఆసక్తి

ఈవీలు, బ్యాటరీ స్టోరేజీ యూనిట్ల ఏర్పాటుకు విన్ గ్రూప్ సంస్థ వెల్లడి

02

# రివ్యూ టైం

ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్, కేటీఆర్ కీలక భేటీ

జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఓటమిపై అగ్రనేతల లోతైన సమీక్ష

తెలంగాణ భవన్‌లో క్యాడర్‌తో కేటీఆర్ సమావేశానికి సిద్ధం

తదనంతర పరిణామాలపై కేసీఆర్ ఆరా

18న తెలంగాణ భవన్ వేదికగా కార్యకర్తలతో సమావేశం



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఎదురైన ఓటమి నేపథ్యంలో పార్టీ వ్యూహాత్మక చర్యలు వేగం పెంచింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్ రావు ఎర్రవల్లి ఫాంహౌస్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సమావేశమయ్యారు. ఓటమి కారణాలు, తదనంతర పరిణామాలు, భవిష్యత్ వ్యూహాలపై కేసీఆర్ కేటీఆర్‌తో సమీక్షించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ బైపోల్స్ ఫలితాలు పార్టీ అంచనాలను తలకిందులు చేసిన నేపథ్యంలో, స్థానిక నాయకత్వం, క్యాడర్ స్థాయి బలహీనతలు, ప్రచార తీరుపై కేసీఆర్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. బైఎలక్షన్లలో ఎదురైన ప్రతికూలతల నుంచి బయటపడడానికి ఏ మార్పులు అవసరమో పార్టీ అగ్రనేతలు అంతర్గతంగా చర్చించినట్టు వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, కేటీఆర్ స్వయంగా జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశంకానున్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్న ఈ సమావేశానికి స్థానిక క్యాడర్‌ను భారీ సంఖ్యలో ఆహ్వానించారు. ఓటమి నేపథ్యంలో క్యాడర్‌లో నెలకొన్న అసంతృప్తి, స్థానిక స్థాయి లోపాలు, ప్రచార వ్యూహాలు, భవిష్యత్ బలోపేత కార్యక్రమాలపై కేటీఆర్ నేరుగా పార్టీ కార్యకర్తలతో చర్చించనున్నారు. జూబ్లీహిల్స్ ఓటమిని పాఠంగా తీసుకుని, పార్టీని మళ్లీ పటిష్టం చేయడానికి అవసరమైన చర్యలను ఈ సమీక్షల ద్వారా బీఆర్ఎస్ నిర్ణయించనున్నట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

# కాంగ్రెస్ గూండాయిజం చేస్తోంది

ఫలితాలు వచ్చి 24 గంటలు గడవకముందే కార్యకర్తపై దాడి

మేం గతంలో ఎన్నో ఎన్నికల్లో గెలిచినప్పటికీ ఇలా చేయలేదని వ్యాఖ్య

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కేటీఆర్ హామీ

**హైదరాబాద్, ప్రజాస్వరం**



జూబ్లీహిల్స్ ఫలితాలు వెలువడి 24 గంటలు కూడా గడవకముందే కాంగ్రెస్ గూండాయిజానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తాము కూడా ఎన్నో ఎన్నికల్లో గెలిచినప్పటికీ ఇలాంటి దాడులకు పాల్పడలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు నిన్న రాత్రి విజయగర్వంతో ఊరేగింపు నిర్వహించాయని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ..మిగతా 0లో

# దేశ 'ఏరో ఇంజిన్ రాజధాని'గా తెలంగాణ




02

2030 నాటికి తీర్చిదిద్దేలా కాంప్రెహెన్సివ్ రోడ్డు మ్యాప్

'ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్'లో మంత్రి శ్రీధర్ బాబు




# ఐబొమ్మ రవి అరెస్ట్

సీసీఎస్ నుంచి నాంపల్లి కోర్టుకు తరలింపు

కీలక సమాచారం సేకరించిన సైబర్ క్రైమ్ పోలీసులు

ఐ-బొమ్మ వెబ్‌సైట్స్‌కి కీలకంగా పనిచేసిన రవి

నెట్‌వర్క్‌పై ఆరా తీసిన సీసీఎస్ పోలీసులు

త్వరలో మరికొన్ని అరెస్టులు ఉండే అవకాశం

02



# కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు

ఓటములపై కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలి

కాంగ్రెస్ సీనియర్లు రాహుల్ తీరుతో అసంతృప్తిగా ఉన్నారు

బీహారీలు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మోదీ

**హైదరాబాద్, ప్రజాస్వరం**

కులతత్వ విషాన్ని చిమ్మేవారిని, ముస్లిం లీగ్‌మావోయిస్టు భావజాలం కలిగిన వారిని బీహార్ ప్రజలు తిరస్కరించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సూరత్‌లో స్థిరపడిన బీహారీలు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, దశాబ్దకాలంగా ఓటములపై కాంగ్రెస్ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ముస్లింలీగ్‌మావోయిస్టు కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారని ఆయన అన్నారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో ..మిగతా 0లో



# బెట్టింగ్ యాప్స్ కేసులో సీఐడీ దూకుడు

విచారణకు హాజరైన దగ్గుబాటి రానా, విష్ణుప్రియ

ఆర్థిక లావాదేవీలపై ఆరా.. స్టేట్‌మెంట్ రికార్డ్

ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులను ప్రశ్నించిన అధికారులు

కొనసాగుతున్న దర్యాప్తు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బెట్టింగ్ యాప్ ప్రమోషన్ కేసులో టాలీవుడ్‌కు చెందిన 29 మంది సినీ సెలబ్రిటీలతో పాటు కంపెనీలపై ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో భాగంగా దగ్గుబాటి హీరో రానా విచారణకు హాజరు కావాల్సిందిగా సీఐడీ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే శనివారం సీఐడీ పోలీసుల ముందుకు హీరో రానా బెట్టింగ్ ..మిగతా 0లో



# ఢిల్లీలో రేవంత్ రెడ్డిని కలిసిన విన్ గ్రూప్ ఆసియా సీఈవో

- ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి
- తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటుకు విన్ గ్రూప్ ఆసక్తి
- ఈవీలు, బ్యాటరీ స్టోరేజీ యూనిట్ల ఏర్పాటుకు విన్ గ్రూప్ సంస్థ వెల్లడి

హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో విన్ గ్రూప్ ఆసియా సీఈవో సమావేశమయ్యారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉండగా, దేశ రాజధానిలో ముఖ్యమంత్రితో సీఈవో భేటీ అయ్యారు. తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి విన్ గ్రూప్ ఆసక్తి కనబరిచింది. ఈవీలు, బ్యాటరీ స్టోరేజీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు విన్ గ్రూప్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. డిసెంబరు 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరుకావాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని ఆహ్వానించారు. ఇదిలా ఉండగా, అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు పలువురు నేతలు శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు.

# బెట్టింగ్ యాప్స్ కేసులో సీఐడీ దూకుడు

మొదటిపేజీ తరువాయి

యాప్ ప్రమోషన్ల కేసులో విచారణకు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా సీఐడీ అధికారులు హీరో రానాను గంటన్నర పాటు ప్రశ్నించారు. ఈ విచారణకు రానా తన బ్యాంక్ స్టేట్‌మెంట్లతో హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్‌తో రానా చేసుకున్న అగ్రిమెంట్‌పై సీఐడీ విచారించింది. అలాగే బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌తో రానాకు వచ్చిన పారితోషికంపై కూడా సీఐడీ ప్రశ్నించింది. ఈ సందర్భంగా హీరో రానా మాట్లాడుతూ.. తాను స్కిల్ బేస్డ్ గేమ్ యాప్‌ను మాత్రమే ప్రమోట్ చేశానని, ఇప్పటికే ఈ కేసులో సీఐడీకి కూడా స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిపారు. రానా 2017లో బెట్టింగ్ గేమింగ్ యాప్‌ను ప్రమోట్ చేశారు. తాను ఈ గేమింగ్ యాప్‌ను ప్రమోట్ చేయడానికి ముందు తన లీగల టీమ్‌తో అన్నీ పరిశీలించాకే ఒప్పందం చేసుకున్నట్లు గతంలో చెప్పిన రానా వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న ఏ సంస్థతో తాను ఒప్పందం చేసుకోలేదన్న రానా స్పష్టం చేశారు. యాంకర్ విష్ణుప్రియను కూడా సీఐడీ అధికారులు ప్రశ్నించారు. ఇప్పటికే ఈ కేసులో భాగంగా ప్రకాష్‌రాజ్, హీరో విజయ్ దేవరకొండ, సిరిహనుమంతు సీఐడీ విచారణకు హాజరయ్యారు.



# ఐబొమ్మ రవి అరెస్ట్

- సీసీఎస్ నుంచి నాంపల్లి కోర్టుకు తరలింపు
- కీలక సమాచారం సేకరించిన సైబర్ క్రైమ్ పోలీసులు
- ఐ-బొమ్మ వెబ్‌సైట్స్‌కి కీలకంగా పనిచేసిన రవి
- నెట్‌వర్క్‌పై ఆరా తీసిన సీసీఎస్ పోలీసులు
- త్వరలో మరికొన్ని అరెస్టులు ఉండే అవకాశం

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు ఎంతో శ్రమించి పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' ప్రధాన నిర్వాహకుడు ఇమ్మడి రవిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు రవిని నాంపల్లి కోర్టుకు తరలించారు. రవిని విచారించిన పోలీసులు అతని నెట్వర్క్, వెబ్‌సైట్ నిర్వహణ, పైరసీ వ్యవస్థపై అనేక కీలక సమాచారాన్ని సేకరించారు. 2019 నుంచి 'ఐబొమ్మ' వెబ్‌సైట్‌లో పైరసీ సినిమాలను అప్లోడ్ చేస్తూ భారీ నెట్‌వర్క్‌ను నడిపినందుకు రవి ప్రధాన నిందితుడిగా గుర్తించారు. థియేటర్‌లలో కొత్తగా విడుదలైన సినిమాలను గంటల వ్యవధిలోనే వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేసే పెద్ద సర్కిల్‌ను అతడు నడిపేవాడని పోలీసులు వెల్లడించారు. ఆరు సంవత్సరాల కాలంలో వేలాది సినిమాలను పైరసీ చేసి అప్లోడ్ చేయడంతో టాలీవుడ్‌కు దాదాపు 3వేల కోట్లు నష్టం జరిగినట్లు అంచనా. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు ఐబొమ్మతో పాటు 65 పైరసీ వెబ్‌సైట్‌లపై కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు ఈ కేసులో ఐదుగురు కీలక నిందితులను అరెస్టు చేశారు. తాజాగా రవిని అదుపులోకి తీసుకోవడం కేసులో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఐబొమ్మ వెబ్‌సైట్‌కు ప్రధానంగా పని చేసిన రవి, పోలీసులను సవాల్ చేస్తూ "నన్ను పట్టుకోలేరు" అని చెప్పిన సందర్భాలు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. అయితే ఉదయం రవిని గుర్తించిన సీసీఎస్ ప్రత్యేక బృందం అతడిని అదుపులోకి తీసుకుంది. రవికి సంబంధించిన ఏజెంట్ల నెట్‌వర్క్, హ్యాండ్లర్‌ల వ్యవస్థపై పోలీసులు మరింతగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రవి ఇచ్చిన సమాచారంతో త్వరలో మరికొన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు సీసీఎస్ వర్గాలు చెబుతున్నాయి.



# దేశ 'ఏరో ఇంజిన్ రాజధాని'గా తెలంగాణ

- 2030 నాటికి తీర్చిదిద్దేలా కాంప్రెహెన్సివ్ రోడ్డు మ్యాప్
- 'ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్'లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ప్రజాస్వరం

2030 నాటికి తెలంగాణను దేశ "ఏరో ఇంజిన్ రాజధాని"గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇందుకోసం ప్రపంచంతో పోటీపడేలా దిగ్గజ పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యంతో "ఏరోస్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్"ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు కాంప్రెహెన్సివ్ రోడ్డు మ్యాప్ ను రూపొందిస్తున్నామన్నారు. 'ఎండ్ టూ ఎండ్ ఎకోసిస్టం' కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన పునాదులే ప్రస్తుతం తెలంగాణను దేశ స్ట్రాటెజిక్ డిఫెన్స్ హబ్ గా మార్చాయని వివరించారు. కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్ మెంట్, ఐఎస్ బీ, ముంజాల్ ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ సంయుక్తాధ్వర్యంలో శనివారం గచ్చిబౌలి లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్ బీ)లో నిర్వహించిన 'ఎంపవరింగ్ ఆత్మనిర్భర్ భారత్: ఇండియాస్ ఏరోస్పేస్ & డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం (కీ నోట్ అడ్రస్) చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఏఅండ్ డీ రంగంలో నమోదవుతున్న వేగవంతమైన వృద్ధిని మనకు అనుకూలంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాల వల్ల గ్లోబల్ సప్లై చెయిన్ ఒత్తిడికి గురవుతుందని, ఈ తరుణంలో విశ్వసనీయమైన సరఫరాదారుల కోసం ప్రపంచం ముఖ్యంగా 'భారత్' లాంటి దేశాలవైపు చూస్తోందన్నారు. గతేడాది దేశ రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రికార్డు స్థాయిలో రూ.1.5 లక్షల కోట్ల మార్కును దాటిందన్నారు. రక్షణ రంగ ఎగుమతుల్లో 12 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఈ రంగ పురోగతికి నిదర్శనమన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యసాధనలో 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్' రంగం కీలక పాత్ర పోషించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 25కు పైగా 'ఏఅండ్ డీ' అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు, సుమారు 1500కు పైగా ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్' ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023 24లో రూ.15,900 కోట్లు కాగా 202425లో కేవలం మొదటి తొమ్మిది నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరగడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిలువెత్తు సాక్ష్యమన్నారు. ఆదిభట్లలో రూ.425 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన 'టాటా-సాఫ్రాన్' ఫెసిలిటీ ఇటీవల అందుబాటులోకి వచ్చిందన్నారు. త్వరలోనే రూ.800 కోట్లతో జేఎస్ డబ్ల్యూ డిఫెన్స్ 'యూఏవీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్', రూ.500 కోట్లతో ప్రీమియర్ ఎక్స్ప్లోజివ్స్ డిఫెన్స్ ఫెసిలిటీ కూడా వస్తాయన్నారు. ఈ తరహాలోనే పెట్టుబడులు పెట్టేందుకు మరికొన్ని దిగ్గజ సంస్థలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హీరో ఎంటర్ ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్, ఐఎస్ బీ డీన్ ప్రొఫెసర్ పి.మదన్, ప్రొఫెసర్ చందన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు

మొదటిపేజీ తరువాయి

పనిచేసిన కాంగ్రెస్ జాతీయ నాయకులు కూడా రాహుల్ గాంధీ వ్యవహారశైలితో తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షాలు, కార్యకర్తలకు కూడా పరాజయం గురించి వివరించే పరిస్థితి ఆ పార్టీలో లేదని ఆయన విమర్శించారు. ఈవీఎంలు, ఎన్నికల సంఘం, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను నిందించే సులభ మార్గాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంచుకుందని ఆయన అన్నారు. కులతత్వ విషాన్ని చిమ్ముతున్న వారిని ప్రజలు తిరస్కరిస్తారని బీహార్ ఎన్నికలు మరోసారి రుజువు చేశాయని ఆయన అన్నారు. దళితులు అధికంగా ఉండే 38 స్థానాల్లో ఎన్డీయే 34 స్థానాలను గెలుచుకుందని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ గూండాయిజం చేస్తోంది

మొదటిపేజీ తరువాయి

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. తమ కార్యకర్తపై దాడికి పాల్పడినందుకు కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. దొంగ ఓట్లు, గూండాగిరి, డబ్బులు పంచి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ గూండాయిజం ఇలాగే కొనసాగితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. నిన్న రాత్రి కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయోత్సవ ఊరేగింపుతోనే ఎవరిది అహంకారమో తేటతెల్లమైందని ఆయన అన్నారు. గతంలో తాము అనేక ఉప ఎన్నికల్లో విజయం సాధించామని, అప్పుడు కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కలేదని గుర్తు చేశారు. అలాంటి సమయంలో తాము కాంగ్రెస్ పార్టీ గుర్తును గాడిద మీద ఎక్కించి ఊరేగించామా? అని ప్రశ్నించారు. ఒక ఉప ఎన్నిక గెలిచినందుకే ఇంత అహంకారమా అని ఆయన ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తు కారును క్రేన్‌తో లాక్కెళ్లడం సరికాదని అన్నారు. రహమత్‌నగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త రాకేశ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. తీవ్ర గాయాలు కావడంతో ఆయనకు ఎస్ఆర్ నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దాడిని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు.





## ఇందిరమ్మ ఇంటికి స్లాబ్ పనుల ప్రారంభం

**మేడ్చల్, (ప్రజాస్వరం ) :**

పేద ప్రజల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రాజబోల్లారం పాష అన్నారు. శనివారం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు అస్మా బేగం కు మంజూరైన నిధుల ద్వారా ఇంటి స్లాబ్ పనులను లబ్ధిదారులతో కలిసి రాజబోల్లారం పాషా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఆరిఫ్, ఎండీ అహ్మద్,వెంకటేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- **రామాయంపేట ఎస్ఐ బాలరాజు**

**రామాయంపేట, ( ప్రజా స్వరం ) :**



మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రామాయంపేట ఎస్సై బాలరాజు హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు పంపిన మెసేజ్, లింకు ఓపెన్ చేసి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల వలలో పడి డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## దుబ్బాక మున్సిపాలిటీ పనులకు రూ.15 కోట్లు విడుదల



**దుబ్బాక, నవంబర్ 15 (ప్రజాస్వరం) :**

దుబ్బాక మున్సిపల్ పెండింగ్ లో ఉన్న పనులకు గాను 15 కోట్ల రూపాయలను విడుదల చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు.సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి నియోజకవర్గ లబ్ధిదారులకు 141 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక మున్సిపాలిటీ 20 వార్డులకు గాను 10 కోట్ల రూపాయలు వార్డుకు 50 లక్షలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దుబ్బాక పెద్ద చెరువు కట్ట, రామ సముద్రం చెరువు, దుంపలపల్లి వెళ్లే చెరువు సుందరీకారణ కోసం ఐదు కోట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. వీటికి సంబంధించి త్వరిత గతిన టెండర్లను ఆహ్వానించాలని మున్సిపల్ అధికారులకు సూచించడం జరిగిందన్నారు. 10 కోట్ల రూపాయలతో వార్డులలో డ్రైనేజీ నిర్మాణాలు సీసీల నిర్మాణాలు రోడ్ల నిర్మాణాల కోసం ఈ నిధులను కేటాయించడం జరిగిందన్నారు. దుబ్బాక నుండి సిద్దిపేటకు వెళ్లే రోడ్డు పక్కన రామసముద్రం చెరువు కట్ట ఉండడంతో వర్షాకాలం వస్తే నీరంతా రోడ్లపై నుండి పారడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై రవాణా దారులకు ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యను కూడా పరిష్కార ఇస్తామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు అధ్వానంగా మారాయని పలుమార్లు అధికారులను ప్రభుత్వాన్ని రోడ్లను బాగు చేయాలని కోరడం జరిగిందని రోడ్ల సమస్య తీరకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని హెచ్చరించడం జరిగిందన్నారు. రోడ్లు సరిగా లేక బస్సు ప్రణాయ ప్రయాణాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుబ్బాక డిపోకు సరిపడా బస్సులు కూడా లేవని ఇప్పటివరకు 10 బస్సులు స్టార్ట్ ఏజ్ లో ఉన్నాయని ఆయన అన్నారు. ఈ బస్సులలో చాలావరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే ఉన్నారని ఈ రోడ్లను త్వరితగతిన బాగు చేసి ప్రయాణికులకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక తాజా మాజీ ప్రజా ప్రతినిధులు మాజీ జెడ్పిటిసి కడతల రవీందర్ రెడ్డి, దుబ్బాక పిఎసిఎస్ చైర్మన్ కైలాసం, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లె వంశీకృష్ణ గౌడ్, మండల ఆధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, జీడిపల్లి రవి,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకం

# నిరుపేదలకు వరం

**మేడ్చల్, (ప్రజాస్వరం ) :**



రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలలోని పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్ధి దారులు నిర్మించుకున్నటువంటీ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాల గృహకలను నిజం చేస్తూ ఇందిరమ్మ ఇళ్ళ పతకం ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. ఈ పథకం లక్షలాది కుటుంబాలకు ఆశ, ఆత్మవిశ్వాసం,భద్రత ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. రూ. ఐదు లక్షల ఆర్థిక సాయంతో సొంత ఇల్లు కలగజేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి, గుండ్ల పోచంపల్లి పోచంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ వెంకట గోపాల్,ఆర్ ఐ రాజు, మేడ్చల్ మున్సిపాలిటీ,గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ, ఎల్లంపేట మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సాయి పేట శ్రీనివాస్, విగ్నేశ్వర్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**దుబ్బాక, నవంబర్ 15 (ప్రజాస్వరం) :**



దుబ్బాక మండల కేంద్రంలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం రోజు దుబ్బాక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ మరియు మండలాల 48 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు 13,32,000/రూపాయలను కాంగ్రెస్ పార్టీ దుబ్బాక మున్సిపల్ పట్టణ అధ్యక్షులు నర్మెట ఏసు రెడ్డి,మండల అధ్యక్షులు కొంగరి రవి,లు కార్యకర్తలతో కలిసి సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకులు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేకుకుంట ఆలయ డైరెక్టర్ బాలగౌడ్, మట్టా కిషన్ రెడ్డి ఆకుల భరత్, వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి,కార్యకర్తలు,లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు ఆర్థిక భరోసా

- **మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**
- **కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ**

**జవహర్ నగర్, నవంబర్ 15, ప్రజాస్వరం:**



పేదింటి ఆడపిల్లల పెళ్ళికి ఆర్థిక భరోసా అందించేది కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్ లోని రెవిన్యూ కార్యాలయంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 55 మంది షాదీ ముబారక్ ,కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల ను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆడపిల్లల పెళ్లి భారం కాకూడదని అప్పటి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. చెక్కులు అద్దుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మేకల కావ్య, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, జుట్టు శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి, బండకింది ప్రసాద్ గౌడ్,సుధాకర్ చారి, రెడ్డిశెట్టి మహేష్ గుప్తా, శ్రీరాములు,పల్లపు రవి, బండి నవీన్ గౌడ్,అహ్మద్ పాషా, సిద్ధులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# వరి కొయ్యలను కాల్చితే రైతులకు నష్టం



- **వ్యవసాయ అధికారి భరత్ కుమార్**

**నార్సింగి నవంబర్ 15 (ప్రజా స్వరం)**

వరి కొయ్యల ను కాల్చడం వల్ల రైతులకు నష్టం కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి భరత్ కుమార్ అన్నారు. నార్సింగి గ్రామం లో క్షేత్ర స్థాయి పర్యటన లో వ్యవసాయ అధికారి రైతులతో మాట్లాడుతూ దాదాపు 80 శాతం వరి పంటల కోతలు పూర్తి అయ్యాయని, కోతల అనంతరం పొలాల్లో మిగిలి పోయే వరి కొయ్య లను కాల్చడం కంటే కలియ దున్నడం వల్ల రైతులకు అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూమిలోని నేలకు మేలు చేసే సూక్ష్మ జీవులు, వాన పాములు చనిపోతాయని, పై పొరలో ఉండే సేంద్రియ కర్బనం తగ్గుతుందని అందువల్ల పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని వివరించారు. కాల్చడం వల్ల భూమి గట్టిపడి నీరు నిల్వ సామర్థ్యం తగ్గిపోయి క్రమేపి చౌడు భూమి గా మారుతాయి. కాల్చడానికి బదులు వరి కోసిన అనంతరం నీటిని పెట్టి ఎకరానికి 150 కేజీ ల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్.ఎస్.పీ) వేసి 10 15 రోజుల తరువాత రోటోవేటర్ రెండు సార్లు కలియ దున్నడం వల్ల వరి గడ్డి కుళ్ళి నేలలో సేంద్రియ కర్బనం స్థాయి పెరుగుతుందని అన్నారు. నేలలో నీటి నిలువ సామర్థ్యం పెరిగి, నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి స్థూల, సూక్ష్మ పోషకాలు పంటకు అంది దిగుబడి పెరుగుతుందని అన్నారు. పంట వ్యర్థాలు త్వరగా కుళ్లడానికి రైతులు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా మార్కెట్ లో లభ్యమయ్యే వేస్ట్ డికంపోజ్ ద్రావణాన్ని చల్లుకుని, రోటొవేటర్ తో గాని లేదా కల్టివేటర్ తో కలియ దున్ని నట్లయితే సేంద్రియ కర్బనం పెరిగి సూక్ష్మ జీవులు, వాన పాముల సంతతి పెరిగి పంట దిగుబడికి దోహద పడతాయని అవగాహన కల్పించారు. పంట వ్యర్థాలను కాల్చి నట్లయితే పంటకు నష్టం తో పాటు, వాయు కాలుష్యం పెరిగి రైతుల ఇతరుల ఆరోగ్యం, పర్యావరణం దెబ్బ తింటుందని, కావున రైతులు వ్యర్థాలను కాల్చ వద్దని మండల వ్యవసాయ అధికారి భరత్ కుమార్ కోరారు.


# కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**మిరుదొడ్డి, నవంబర్ 15 (ప్రజాస్వరం) :**

మిడిదొడ్డి మండల కేంద్రంలో మొక్కల కేంద్రాన్ని తనిఖీలు చేసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సందర్శించారు . రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మిరుదొడ్డి మండలంలో మరొక మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు కోరారు. మండల కేంద్రంలో ఒకే కొనుగోలు కేంద్రం ఉండడం వలన రైతులకు తీవ్ర ఇబ్బంది పాలవుతున్నారని రైతులు ఎమ్మెల్యేలను కోరారు. త్వరలో మరొక కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని ఆయన రైతులకు తెలిపారు కొనుగోలు నిర్వాహకులు తప్పనిసరిగా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రైతులకు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టిఆర్ఎస్ నాయకులు రామ్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు హైమద్, తుమ్మల బాలరాజు, లింగం సల్లూరి మల్లేశం, బాబుతోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి



**దౌల్తాబాద్, నవంబర్15(ప్రజాస్వరం) :**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశా కమిటీ జిల్లా సభ్యులు బాగన్నగారి రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

# ఇసుక డంప్ బహిరంగ వేలం

- **తహశీల్దార్ గ్రేస్ బాయి**

**నార్సింగి, నవంబర్ 15 (ప్రజా స్వరం) :**



సహాయక డైరెక్టర్, మైన్స్ & జియాలజీ, మెదక్ ఆదేశాల మేరకు మండల కేంద్ర శివారులో ఈ నెల 14వ తేది నాడు స్వాధీనం చేసుకున్న ఇసుక డంపును బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ గ్రేస్ బాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా నిల్వ చేసి ఉంచిన దాదాపు 15 ట్రాక్టర్ల ఇసుక డంప్ కు ఈ నెల 17 వ తేది సోమవారం నాడు మధ్యాహ్నం 1:30 గం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇసుక వేలంలో ఆసక్తి ఉన్న వారు పాల్గొన వచ్చని అని గ్రేస్ బాయి తెలిపారు.



# బాధిత కుటుంబానికి పరామర్శ

**మీరుదొడ్డి, నవంబర్ 15 (ప్రజాస్వరం) :**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బిఆర్ఎస్ నాయకుడు తోట నగేష్ రెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని శనివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలు మిరుదొడ్డి మండల కేంద్రంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు అనంతరం వారు మాట్లాడుతూ తోకల నగేష్ రెడ్డి మరణం తీరనిలోటు అని అన్నారు వారి వెంట బిఆర్ఎస్ నాయకులు సుకురి లింగం, మాజీ కో ఆప్షన్ సభ్యులు హైమద్, రామ్ రెడ్డి, వెంకటయ్య తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి వ్యక్తి మృతి

- **ఘటన స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్ గ్రేస్ బాయ్**

**నార్సింగి, నవంబర్ 15 (ప్రజా స్వరం) :**

ధాన్యం లోడు కాంటా చేసుకుని వెనుక వైపునకు వస్తున్న లారీ వడ్లు ఆరబోసి సైకిల్ పై వస్తున్న వ్యక్తిని ఢీ కొట్టగా వ్యక్తి లారీ చక్రాల కింద పడి మరణించిన సంఘటన నార్సింగి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ బీమరి సృజన తెలిపిన వివరాల ప్రకారం శంఖాపూర్ లోని వడ్ల కొనుగోలు కేంద్రం నుంచి మండల కేంద్రంలోని తిరుమల రైస్ మిల్లుకు బయలుదేరింది. అక్కడ లారీ డ్రైవర్ లారీని అతివేగంగా అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా వెనుక వైపుకు నడుపుతూ రోడ్డు పై సైకిల్ పై వెళుతున్న పైతరి బాలయ్య (44) ను ఢీ కొని అతని పై నుంచి వెళ్ళింది. పై నుంచి లారీ వెళ్లడంతో బాలయ్య తల చిద్రమై, శరీరం చిద్రమై మృతుడి ని గుర్తు పట్టని విధంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ మహమ్మద్ అలీమ్ ఘటనా స్థలం నుంచి పారిపోయాడని. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పక్కకు తీసి మృతుని వివరాల కోసం ఆరా తీయగా మృత దేహం పై ఉన్న ఆనవాళ్ల తో మృతుని భార్య పైతరి రామవ్వ చనిపోయిన వ్యక్తి తన భర్త బాలయ్య అని ధృవీకరించింది. మృతుని భార్య రామవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సృజన తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం ప్రమాదంలో మరణించిన బాలయ్య భార్య రామవ్వతో పాటు ఎస్సీ కాలనీ వాసులు ప్రమాదం జరిగిన కూడలి లో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ గ్రేస్ బాయి కు వినతి పత్రం అందజేశారు. వారి దరఖాస్తు మేరకు తహశీల్దార్ గ్రేస్ బాయి, ఆర్.ఐ శ్రీధర్, జి.పి.ఓ



నాగరాజు, ఈ.ఓ నాగభూషణం తో పాటు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఆ స్థలంలో తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉండడంతో అక్కడ విద్యుత్ దీపాలు అమర్చాలని, రోడ్డు వద్ద, మూల మలుపు వద్ద గ్రావెల్ వేయాలని ఈఓ ను ఆదేశించారు. రోడ్డు పై వరి కాంటా నిర్వహించ వద్దని హెచ్చరించారు. దీంతో ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా రోడ్డుపై కాంటా ను నిలిపివేశారు. రోడ్డు పై ఉన్న గుంతల లో మట్టి వేయాలని ఈఓ నాగభూషణం కు సూచించారు. భవిష్యత్తు లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ గ్రేస్ బాయి తెలిపారు.

# అభివృద్ధి పనులు చేపట్టాలి

**దుబ్బాక, నవంబర్ 15, (ప్రజాస్వరం) :**

సిద్దిపేట్ జిల్లా మిరుదొడ్డి మండల పరిధిలోని మారుముల గ్రామమైన అందే గ్రామ ఊరుకు మూడు వైపులా ఉన్న రోడ్లు గుంతలుగా మారాయని, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నుండి తమను కాపాడాలని దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభకర్ రెడ్డి నీ కలిసి వినతిపత్రం అందజేశారు.గత ఇరవై సంవత్సరాల కాలములో వేసిన అందె మిరుదొడ్డి పంచాయతీ రాజ్ రోడ్డు, పూర్తిగా ధ్వంసము అయ్యాయని,గ్రామంలోని అందే నుండి మిరుదొడ్డి వరకు, గుంతలు పడి, కంకర తెలీ , పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులను, రైతులు ఆరుగాలని చేసి పండించిన పంటలు మార్కెట్ లో అమ్ముకుందామని వెళ్ళితే, అనేక రోడ్డు ప్రమాదల బారిన పడుతూ ఉన్నామని వారికి దృష్టికి తీసుకువచ్చారు,అందె



గ్రామానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వేసిన రోడ్ల తప్ప తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మా తలరాతలు గాని మా గ్రామ అభివృద్ధి గాని నోచుకోలేదని అన్నారు. కనీసం ఈ ప్రభుత్వాన్ని కైనా మా గోడును తెలియజేసి మా ఊరికి రోడ్లు వేయించి, రవాణా సదుపాయం బస్సులు సికింద్రాబాద్ కి వేసే దిశగా మాకు సహకరించాలని,మిరుదొడ్డి మండల పరిసర ప్రాంతల లో, రైతులు పండించిన కూరగాయల, విక్రయకేంద్రాన్ని, ఏర్పాటు చేయాలనీ కోరారు. రోడ్లు వేయించే బాధ్యత తీసుకుంటామని,సదరు పంచాయతీ రాజ్ డి ఈ ఈ కి ఫోన్ చేసి రోడ్ ఎస్టిమేషన్ పంపాలని కోరారు. రోడ్డు వేసే భాద్యత, డిపో మేనేజర్ తో మాట్లాడి. పాఠశాల కళాశాల విద్యార్థులకు, బస్సు సౌకర్యం రవాణా సదుపాయాలు కల్పిస్తామని ఆ దిశగా ప్రభుత్వంతో మాట్లాడి,న్యాయం జరిగేటట్టు చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో జే ఏ సి కన్వీనర్ వారల రాజు కుమార్,అందె ప్రవీణ్,నర్సింహా రెడ్డి,సతీష్,పర్శరాములు, తరుణ్,, కుమార్, అఖిల్ గౌడ్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలను పేదలకు అందించాలి

**మీరుదొడ్డి, నవంబర్ 15 (ప్రజాస్వరం) :**

ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను నిరుపేదలకు సకాలంలో అందించే విధంగా చూడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య లు అన్నారు. శనివారం దుబ్బాక నియోజవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన నమిలే విజయలక్ష్మి కి 30 వేల రూపాయలు, ఎనగంటి అక్షయ 29000, ఎర్రోళ్ల నరేష్ 49,000, ల చెక్కులను అందించారు. ఆయన వెంట టిఆర్ఎస్ నాయకులు తుకూరి లింగం, మాజీ కోఆప్షన్ సభ్యులు హైమద్, బాల నరసింహులు , తదితరులు పాల్గొన్నారు.





# కార్తీకమాసంలో ధర్మఘంటలు మోగాలి



- **దౌల్తాబాద్‌లో ఆర్యవైశ్య సంఘం వనభోజనాల్లో హిందూ ఐక్యతకు రాష్ట్ర నాయకుల పిలుపు**

**దౌల్తాబాద్, నవంబర్15( ప్రజాస్వరం)**

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దౌల్తాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు, వాసవి మాత పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రకృతి మధ్య సాంప్రదాయ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, మహిళలు, యువత, పెద్దలు సహా వందలాది మంది పాల్గొని కార్తీకమాస భక్తి, ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్యవైశ్య నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్తీక మాసం అంటే కేవలం ఆచారాలు మాత్రమే కాకుండా, శుద్ధత, సేవ, ఐక్యత, సంస్కృతి పరిరక్షణకు ప్రతీక అని వివరించారు. వనభోజనాలు కుటుంబాలను దగ్గర చేస్తాయి, సమాజాన్ని ఒక్కటిగా నిలబెడతాయి, ధర్మం పట్ల శ్రద్ధను పెంచుతాయని పేర్కొన్నారు.

**హిందువులు సమిష్టిగా ఉంటేనే ధర్మబలం పెరుగుతుంది : రాష్ట్ర నాయకుడు**

భవిష్యత్తులో ప్రతి హిందూ కుటుంబం పరస్పరం తోడుగా నిలబడి, సమాజ బలాన్ని పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

హిందూ ప్రజలు విడివిడిగా ఉంటే సమాజం బలహీనమవుతుందని, ఐక్యతే ధర్మరక్షణకు మార్గమని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

సంస్కృతి పరిరక్షణలో ప్రతి ఇంటి పాత్ర ఉంటుందని, సంప్రదాయాలు నిలిచి ఉండాలంటే భక్తి, సేవ, సంఘటిత భావన తప్పనిసరిగా అవసరమని తెలిపారు.

**ఆర్యవైశ్య సంఘం – సేవకు చిరునామా**

రాష్ట్రవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు ఆర్య వైశ్య సంఘం చేపడుతోందని, విద్య, వైద్యం, సమాజ సేవలో సంఘం ముందుండి పని చేస్తోందని ఆయన గుర్తు చేశారు.

వచ్చే కార్తీకమాసంలో ప్రతి గ్రామంలో అవసరమైన సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

"ప్రతి గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను మరింత స్థాయిలో నిర్వహిస్తాం. ధర్మం కోసం, సమాజం కోసం, మన భవిష్యత్తు తరాల కోసం పనిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని శ్రీనివాస్ అన్నారు.

**భక్తిశ్రద్ధలతో వాసవి మాత పూజలు**

వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. హోమాలు, హారతులు, భజనలు, వేదోక్త మంత్రోచ్ఛరణల్లో పాల్గొన్న భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో తరిచిపోయారు. పూజల అనంతరం వనభో భోజనం నిర్వహించగా శాకాహార సాంప్రదాయ వంటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ ఆటలు, కుటుంబ కార్యక్రమాలు వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయి. కుటుంబాలు, యువత భారీగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సంఘ సభ్యులు, మహిళా విభాగం, యువజన విభాగం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ కార్తీకమాస దివ్యోత్సవాల్లో భాగస్వాములయ్యారు. సంఘం నాయకులు సంఘ కార్యకలాపాలను వివరించగా, భవిష్యత్ కార్యక్రమాలకు గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభించింది.






# కాంగ్రెస్ బలం కంటే.. నవీన్ యాదవ్ హవానే ఎక్కువ

- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి బలం ఉంటే అజారుద్దీన్‌కు టిక్కెట్ ఎందుకివ్వలేదని ప్రశ్న
- గెలిచింది రేవంత్ రెడ్డి కాదు.. నవీన్ యాదవ్ అన్న దాసోజు శ్రవణ్
- ఒవైసీ కాళ్లు మొక్కి, బండి సంజయ్‌తో కుమ్మక్కై గెలిచారని ఆరోపణ



**తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి పలు సర్వేల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ బలం కంటే నవీన్ యాదవ్ ప్రాబల్యం ఎక్కువని తేలిందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకే బలం ఉంటే అజారుద్దీన్‌కు తిరిగి టిక్కెట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గతంలో మజ్లిస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన నవీన్ యాదవ్‌కు టిక్కెట్ ఇవ్వడం ద్వారా, మీకు గెలుస్తామనే విశ్వాసం లేదని స్పష్టమవుతోందని అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా బీజేపీకి చెందిన గణేశ్‌ను తీసుకువచ్చి టిక్కెట్ ఇచ్చారని, కానీ గద్దర్ కుమార్తెకు మాత్రం టిక్కెట్ ఇవ్వలేదని విమర్శించారు. సొంత పార్టీలో ఉన్నవారిని విస్మరిస్తూ బీజేపీ, మజ్లిస్ పార్టీల నుంచి వచ్చిన వారికి టిక్కెట్ ఇచ్చారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి గెలవలేదని, నవీన్ యాదవ్ గెలిచారని ఆయన అన్నారు. తాను అమలు చేసిన పథకాల వల్లే గెలిచానని రేవంత్ రెడ్డి భావిస్తే అది పొరపాటు అని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉందని, గెలుపోటములు సహజమని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాను కూడా బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కొడంగల్‌లో ఓడిపోయారని, ఆయన గతంలో ఎంపీగా గెలిచిన మల్కాజ్‌గిరిలో ఎందరు కార్పొరేటర్లను గెలిపించారని ప్రశ్నించారు. ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీ కాళ్లు మొక్కి, బండి సంజయ్‌తో కుమ్మక్కై మజ్లిస్ ఓట్లతో పాటు బీజేపీ ఓట్లను బదిలీ చేసుకోవడం ద్వారా గెలిచారని ఆయన విమర్శించారు.



Sir, I, P Anand Babu, was suspended by the District Collector, Wanaparthy on 01-08-2025.

**The mentioned reasons in the suspension order are:**


| | |
|---|---|
| My deceitful conduct | No single evidence for this in these three months. |
| Cleanliness of washrooms | No evidence in the form of photos videos, complaints or reports etc. till now in these 3 months. |
| Following of Official Decorum | In a reply to memo, I mentioned about the THREATENING and SEVERE HARASMENT of DMWO to PRACTICE in ILLEGALITY to provide NON – MINORITY seats to Gurukula students and recruit his men in jobs ILLEAGALLY. Rejection from my side is taken as 'I have not followed Official Decorum' |

So, sir, all the mentioned reasons caused my suspension are without evidence and against the Govt. memo 2213 (enclosed) resulting 'Violation of Law'.

# ప్రిన్సిపాల్ సస్పెన్షన్ పై గవర్నర్, చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు

**వనపర్తి,నవంబర్ 15(ప్రజాస్వరం):**

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో నెలకొన్న చిన్నపాటి సమస్యలను బూచిగా చూపి తనపై అక్రమ సస్పెన్షన్ కు కారకుడైన జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారిపై చర్యలు తీసుకోవాలని వనపర్తి బాలుర మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల సస్పెన్షన్ కు గురైన ప్రిన్సిపాల్ ఆనంద్ బాబు శనివారం రాష్ట్ర గవర్నర్ తోపాటు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కి ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పాఠశాలలో ఇతర విద్యార్థులకు సీట్ల సదుపాయం కల్పించాలని జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి తీవ్ర ఒత్తిడి తేగ నిబంధనలకు విరుద్ధంగా తాను ఆయన సిఫారసును వెనక్కి పంపడం వల్ల తనపై మూడు రకాల అంశాలపై కలెక్టర్ కు నిరాధార ఆరోపణలతో ఫిర్యాదు చేయడంతో తాను సస్పెన్షన్ కు గురై తీవ్ర మనస్థాపానికి గురయ్యానని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ తో పాటు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ లు తన సస్పెన్షన్ పై నిష్పాక్షికంగా విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. అలాగే తనపై అక్రమ సస్పెన్షన్ కు సిఫారసు చేసిన జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



Sir, I, P Anand Babu, was suspended by the District Collector, Wanaparthy on 01-08-2025.

**The mentioned reasons in the suspension order are:**

| | |
|---|---|
| My deceitful conduct | No single evidence for this in these three months. |
| Cleanliness of washrooms | No evidence in the form of photos videos, complaints or reports etc. till now in these 3 months. |
| Following of Official Decorum | In a reply to memo, I mentioned about the THREATENING and SEVERE HARASMENT of DMWO to PRACTICE in ILLEGALITY to provide NON – MINORITY seats to Gurukula students and recruit his men in jobs ILLEAGALLY. Rejection from my side is taken as 'I have not followed Official Decorum' |

So, sir, all the mentioned reasons caused my suspension are without evidence and

# దౌర్జన్య నిర్మాణాలు

- జీవీఎంసీ జోన్–8 సచివాలయం 21086–491 ప్రహ్లాదపురం అక్రమ నిర్మాణం చుట్టూ రాజకీయ వలయం!

**విశాఖపట్నం,నవంబర్ 15(ప్రజాస్వరం):**







విశాఖ నగర పాలనలో వెలుగు చూసిన మరో అక్రమ నిర్మాణ కుంభకోణం ఇప్పుడు నగరాన్ని కుదిపేస్తోంది. జీవీఎంసీ జోన్ 8 పరిధిలోని సచివాలయం 21086-491, ప్రహ్లాదపురం వద్ద జరుగుతున్న అక్రమ నిర్మాణం చుట్టూ పరిస్థితులు వేడి రాజకీయం వైపుకు మలుపు తిరుగుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్మాణం సాగుతుండగా దీనిని ఆపాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం మాత్రం నిశ్శబ్ద వీక్షకులుగా మారిపోయింది. ఫైళ్ళు కదల్లేదు... బాధ్యత కదల్లేదు... కానీ నిర్మాణ యంత్రాలు మాత్రం ధమరుధమరూకా సాగుతున్నాయి!

***అనుమతులు లేవు... నిర్మాణం మాత్రం బీభత్సం!**

**స్థానికుల ఆగ్రహం: "జీవీఎంసీ అనుమతులు పక్కన పెట్టి ఈ దౌర్జన్యం?"**

జీవీఎంసీ అనుమతులు పూర్తిస్థాయిలో లేని నిర్మాణం వేగంగా కొనసాగుతుండటం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. అక్కడి నివాసులు మండిపడుతూ చెబుతున్నారు. అనుమతులు లేని చోట భవనం ఎలా పెరుగుతుంది? లేక ఇది ప్రభుత్వ యంత్రాంగమే కట్టిన గోలమా?" రాజకీయ ఆశ్రయం లేకుండా ఇలా బలంగా నిర్మాణం సాగదన్న అభిప్రాయం బలపడుతోంది.

**నిబంధనలు చెప్పే అధికారులకే బెదిరింపులు!**

*ఫిర్యాదు ఉన్నా FIR లేదు... పెందుర్తి పోలీసుల మౌనంపై ప్రశ్నలు! అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకున్న 21086-492 WPRS శర్మిలపై నిర్మాణదారుడు దాడికి కూడా యత్నించినట్టు సమాచారం. పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఆమె చేసిన ఫిర్యాదు ఇప్పటికీ FIR నమోదు కాకపోవడం పోలీసుల వైఖరిపై అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది.

**ప్రజల ప్రశ్న స్పష్టంగా ఉంది**

అధికారులను కూడా రక్షించలేని సిస్టమ్ ప్రజలను ఎలా రక్షిస్తుంది?" నిర్మాణం దగ్గరకు వెళ్లినా బెదిరింపులే! ఫోటోలు, వీడియోలు తీయడానికి ప్రయత్నించిన వారికి దుండగ రీతిలో హెచ్చరికలు? స్థానికుల వాంగ్మూలం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని చిత్రీకరించాలంటే "ఫోన్ తీస్తే చెడుగా ఉంటుంది" అంటూ గ్యాంగ్‌లా బెదిరింపులు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కుట్ర వెనుక స్థానిక కార్పొరేటరే?" —— ప్రజల్లో మోతమోగుతున్న ఆరోపణలు ప్రజలలో గుబాళిస్తున్న అనుమానం ఏంటంటే..!! ఈ నిర్మాణానికి రాజకీయ రక్షణగా నిలుస్తున్నది అదే ప్రాంత కార్పొరేటరా? ఈ ప్రశ్న ఇప్పుడు ప్రహ్లాదపురం నుంచి నగర రాజకీయ సర్కిల్స్ దాకా విస్తరిస్తోంది. అధికారులు మాత్రం సంప్రదాయ సమాధానం తయారు చేసుకున్నట్లు మేము పరిశీలిస్తున్నాం... చర్యలు తీసుకుంటాం..." అనే జపాన్ని జపిస్తూ కరిగిపోతున్నారు. ప్రభుత్వ ఆదాయం గోడి పడుతోంది... కానీ యంత్రాంగం మౌనం? నిర్మాణ రుసుములు, పన్నుల రూపంలో కోట్లు నష్టమయ్యే ప్రమాదం! స్థానిక ప్రముఖులు మండిపడుతూ చెప్పారు ప్రభుత్వ ఆదాయం కరిగిపోతున్నా చూసీ చూస్తూ ఉన్న జీవీఎంసీ నిద్రలేస్తుందా?" ప్రజల డిమాండ్లు చేస్తున్నారు..!!

@ అక్రమ నిర్మాణంపై తక్షణ విచారణ

@ నిర్మాణదారుడిపై క్రిమినల్ కేసులు నమోదు

@ నిర్లక్ష్యంగా వ్యవహరించిన టౌన్ ప్లానింగ్ అధికారులపై డిపార్ట్‌మెంటల్ విచారణ

@ బెదిరించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు

@ కార్పొరేటర్ పాత్రపై పబ్లిక్ క్లారిఫికేషన్

జీవీఎంసీ స్పందించాల్సిన సమయం వచ్చేసింది! నియమాలకు మించి నిర్మాణ మాఫియా శక్తివంతమయ్యిందా? అక్రమాలకు రాజకీయ 'లైసెన్స్' ఇచ్చేది ఎవరు? ఇది నగర పరిపాలనా వైఫల్యానికి ప్రబల నిదర్శనమా? అని నగరం ప్రశ్నిస్తోంది...!! ఈ వ్యవహారం రాజకీయ ఒత్తిళ్లకు బలై ఫైళ్లే డంప్‌యార్డ్‌కు మిగిలిపోతాయా? లేక నిజాలు వెలుగులోకి వస్తాయా? అన్నది ఇప్పుడు విశాఖ ప్రజల ఎదురు చూపు.

## పెండింగ్ కేసులకు శాశ్వత పరిష్కారం – జస్టిస్ లక్ష్మణ్

**మేడ్చల్ మల్కాజ్‌గిరి, నవంబర్ 15. (ప్రజాస్వరం):**

కోర్టుల్లో కేసుల పెండింగ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పరిష్కార వేదికగా లోక్ అదాలత్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్. ఎన్. శ్రీదేవి, కలెక్టర్ మనుచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ——కేసుల పరిష్కారంలో జాప్యాన్ని తొలగించేందుకు న్యాయసేవాధికార చట్టం రూపుదిద్దుకుందని చెప్పారు. కక్షిదారుల విలువైన సమయం వృథా కాకుండా శాశ్వత పరిష్కారం అందించడం లోక్ అదాలత్‌ల లక్ష్యమని తెలిపారు. పేదలకు న్యాయ సేవలు చేరవేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు, సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్‌లను నిరంతరంగా నిర్వహిస్తున్నట్టుగా వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో చట్ట అవగాహన లేని వారికీ సులభ న్యాయం అందించడమే తమ ధ్యేయమన్నారు.ఇరుపక్షాల సమ్మతితో వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లోక్ అదాలత్‌ల అసలు ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.





## ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా 93 కేసులు పరిష్కారం

**వలిగొండ,నవంబర్ 15(ప్రజాస్వరం):**


యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట కోర్టు పరిధిలో మొత్తం 93 కేసులకు పరిష్కారం లభించింది. శనివారం రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, అదనపు ఇంఛార్జి ఎస్.శిరీష కోర్టు హల్ లో ప్రత్యేక లోక్ అధాలత్ ను నిర్వహించారు. రామన్నపేట జ్యుడిషియల్ సంబంధించి రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగుడూరు స్టేషన్ పరిధిలో క్రిమినల్ కేసులు, ప్రీ లిటికేషన్, భూ వివాద కేసులు 77, ఇతర పిట్టి కేసులు 16 పరిష్కరించుకున్నారు. అనంతరం జడ్జీ మాట్లాడుతూ క్షణిక ఆవేశాలతో అప్పటి పరిస్థితులలో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు, సమయం వృధా చేసుకోవడం బదులు రాజమార్గమే రాజమార్గంగా కోర్టు పరిధిలో నిర్వహించే లోక్ ఆధాలత్ వినియోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలని తెలిపారు. కోర్టు ప్రాంగణంలో లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం లు కలిసి పోలీస్ సిబ్బంది సమక్షంలో వివిధ రకాల కేసులు నిమిత్తం కోర్టు కి వచ్చిన వారికి లీగల్ సర్వీసెస్ ద్వారా కేసులు పరిష్కరించుకునే మార్గాలు, సూచనలు అందజేశారు. అనంతరం వారికి లోక్ అదాలత్, లీగల్ సర్వీసెస్ కి సంబందించిన బ్రోచర్ లు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు,వివిధ పోలీస్ స్టేషన్ ల సిబ్బంది,కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సర్టిఫికెట్లు ఇవ్వనన్న నర్సింగ్ కాలేజ్

- విద్యార్థుల ఆవేదన... కేసు నమోదు

**అంకిరెడ్డిపల్లి/చక్రిపురం, నవంబర్ 15 (ప్రజాస్వరం):**





డెవ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులపై యాజమాన్యం అన్యాయం చేయడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బోయిని సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తాను,సంధ్య రాజు,జి.అనిల్, బి.శ్రీనివాస్,కె.గణేష్,ఎం.ప్రదీప్, పి.అజయ్,ఎం.నరసింహ, ఎండి. అర్బాజ్,బి.శివ,జి.రాకేష్, రెహమతుల్లాతో కలిసి 2020-24 బ్యాచ్‌లో డెవ్ నర్సింగ్ కాలేజీలో చేరారు.ఒక్కొక్కరి నుంచి ట్యూషన్ ఫీజుగా రూ.36,500 వసూలు చేసినట్టు తెలిపారు. నాలుగు నెలలకే యాజమాన్యం మారిపోగా,కాలేజీని అంకిరెడ్డిపల్లి నుంచి చక్రిపురానికి మార్చినట్టు విద్యార్థులు పేర్కొన్నారు.కోర్స్ పూర్తయ్యాక అసలు సర్టిఫికెట్లు తీసుకునేందుకు వెళ్లగా ప్రస్తుత యాజమాన్యం వాటిని ఇవ్వనన్నట్టు తెలిపారు. పాత యాజమాన్యానికి చెల్లించిన ఫీజు రికార్డులు తమ వద్ద లేవని, విద్యార్థులు ఫీజు చెల్లించలేదని ప్రస్తుత యాజమాన్యం చెప్పిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాయి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## మైనారిటీ ఉమెన్ డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి.

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 15(ప్రజాస్వరం):**



వనపర్తి, మహబూబ్ నగర్ జిల్లాలలో మైనారిటీ ఉమెన్ డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ ఉమెన్ డిగ్రీ కళాశాలల మాదిరిగానే తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ తరపున కూడా మైనారిటీ ఉమెన్స్ కు డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలని తాను ప్రభుత్వానికి విన్నవించగా మైనారిటీ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ డిపార్ట్మెంట్ నుంచి సానుకూలత వ్యక్తం అయినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు నవంబర్ 3న, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ నుండి ఉత్తర్వులు జారీ అయినట్లు ఆయన తెలిపారు.

# డా. బాలకిష్టయ్య శత జయంతి వనపర్తిలో ఘన నివాళులు.

- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి,నవంబర్15 (ప్రజాస్వరం):**

పేదల డాక్టరుగా, ప్రజల మనిషిగా పేరు పొందిన సోషలిస్ట్ అభ్యుదయవాది డా. బాలకిష్టయ్య శతజయంతి వేడుకలు వనపర్తిలో శనివారం ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జనరల్ ఆసుపత్రి ఆవరణలోని కాంస్య విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ— "డా. బాలకిష్టయ్య ప్రజల కోసం పుట్టినవారు. పేదల సంక్షేమం కోసం, వనపర్తి అభివృద్ధి కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించారు. ఆయన చూపిన సేవాస్ఫూర్తి ఈ తరం అందరికీ ఆదర్శం" అని పేర్కొన్నారు. వనపర్తి పితామహుడిగా గుర్తింపు డా. బాలకిష్టయ్య ప్రజా డాక్టరుగా సేవలందిస్తూ పట్టణ అభివృద్ధి సంస్థను స్థాపించడం, సర్పంచ్, మున్సిపల్ చైర్మన్‌గా పనిచేస్తూ తాగునీటి సమస్యలు, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అనేక రంగాల్లో మార్పులు తీసుకువచ్చారని నిరంజన్ రెడ్డి గుర్తుచేశారు. అటు ఉద్యోగ అవకాశాల కల్పనలోనూ కీలక పాత్ర పోషించి "వనపర్తి పితామహుడు" అనే బిరుదు పొందారని ఆయన అన్నారు. ఎంఎల్ఏగా విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపి జూనియర్ కళాశాల, మహిళా జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల ఏర్పాటు ద్వారా వేలాది మంది విద్యార్థుల భవితకు బాటలు వేసారన్నారు. శతజయంతి ఉత్సవాలకు కమిటీ ఏర్పాటు తదనంతరం నిరంజన్ రెడ్డి స్వగృహంలో జరిగిన శతజయంతి ఉత్సవ కమిటీ సమావేశంలో, డా. బాలకిష్టయ్య సాహితీకళా పోషణ, ప్రజాసేవ, రాజకీయ జీవితం, అభివృద్ధి పరంపరలను నేటి సమాజానికి చాటిచెప్పేలా సంవత్సరం పొడవున శతజయంతి ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. శ్రేయోభిలాషులు, అభిమానులు కలిసి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డా.భూపేష్,మాజీ ఐఏఎస్ దినకర్,మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రమిలమ్మ,మాజీ సర్పంచ్ జయంతి,సంజీవ్ ముదిరాజ్, సంజయ్,జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్,కురుమూర్తి యాదవ్, నందిమల్ల అశోక్,బాల్ రామ్ సార్, వేణు రెడ్డి,స్వరాజ్యం సార్, వీరయ్య సార్,కృష్ణయ్య సార్, అమర్నాథ్,శంకర్ గౌడ్,బైరోజు చంద్రశేఖర్,మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి,కాగితాల లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ, నాగన్న యాదవ్,ఉంగ్లం తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి,ఇమ్రాన్, మాణిక్యం,జాత్రు నాయక్,జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము,మంద రాము తదితరులు పాల్గొన్నారు.




# కృత్రిమమేధను అనుసరించడం కాదు... మనమే ముందుండి నడిపిద్దాం!

- **రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ తో భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకుందాం**
- **ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు వస్తాయి**
- **మార్పును అడ్డుకోవడం కాదు... దాని రూపకల్పనలో భాగస్వాములం అవుదాం**
- **ఏఐ అవకాశాలపై సదస్సులో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్**

**విశాఖపట్నం,నవంబర్ 15(ప్రజాస్వరం):**




ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇకపై భవిష్యత్ సాంకేతికత కాదు... అది ఇప్పుడు ఇక్కడే ఉందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ - ఉద్యోగాల భవిష్యత్తు - సవాలును అవకాశంగా మార్చుకోవడం (AI and the Future of Jobs — Turning Disruption into Opportunity) అనే అంశంపై సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ ప్రాంగణంలో జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... పారిశ్రామిక విప్లవం వచ్చిన ప్రతిసారి ఉద్యోగాలు పెరుగుతాయి. ఏఐ ఇప్పుడు పరిశ్రమల పనితీరును సమూలంగా మార్చేస్తోంది, ఉత్పాదకతకు పునర్నిర్వచిస్తోంది, పని నియమాలను రాస్తోంది. ఇప్పుడు మన ముందున్న ప్రశ్న ఎఐని మనమే ముందుండి నడిపించడం, లేదా అది చూపిన మార్గంలో నడవడం.
అడ్డంకులు, అసమానతలు లేకుండా ఎఐ ద్వారా మరింత డైనమిక్ గా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం మన చేతిలో ఉంది. ఇందుకోసం మూడు విభాగాలుగా ఫ్రేమ్ వర్క్ ను రూపొందించుకోవాల్సి ఉంది. 1. పునఃనైపుణ్యం 2).పునఃనిర్వచించడం 3).పునరాలోచించడం (Reskill, Redefine, Reimagine). ఒకసారి నేర్చుకొని జీవితాంతం పనిచేసే కాలం పోయింది. చిరకాల అభ్యాసం ఇక విలాసం కాదు... అవసరం. రీస్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ ద్వారా రేపటి ఉద్యోగాలకు అనువైన ఎకోసిస్టమ్ ను మనం నిర్మించాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యూచర్ స్కిల్స్ ప్రాజెక్ట్ ఇప్పటికే ప్రారంభమైంది. ఏఐ ఎథిక్స్, డేటా స్టోరీటెల్లింగ్, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, సస్టైనబుల్ టెక్నాలజీ మీద మా ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఎఐ శిక్షణ, నైతిక పర్యవేక్షణ, మానవ యంత్రాల సహకారంతో 2025నాటికి ప్రపంచవ్యాప్తంగా 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఒక అంచనా. భవిష్యత్ సాంకేతికలతో ఉద్యోగాలు పొందటమే కాకుండా, వాటిలో అసాధారణ, చురుకైన పాత్ర పోషించేలా మన యువతను తయారు చేయాలి.
ఎఐ సాంకేతికత భవిష్యత్తుకు ఒక బ్రిడ్జిగా ఉండాలి తప్ప అడ్డంకి కాకూడదు. ఎఐ విప్లవం పట్టణ, గ్రామాల మధ్య, పురుషులు, మహిళలు మధ్య, నైపుణ్యం కలిగిన వారు, వెనుకబడిన వారి మధ్య అంతరాలను పెంచకూడదు. భారతదేశ జనాభాలో 65శాతం మంది 35ఏళ్లలోపు వయస్కులు ఉన్నారు. ఈ డెమొగ్రఫిక్ డివిడెండ్ ను డిజిటల్ లిటరసీ, వొకేషనల్ ట్రైనింగ్, ఎంటర్ ప్రెన్యూరల్ మద్దతుతో భవిష్యత్ వ్యవస్థకు పెట్టుబడిగా మలచుకోవచ్చు. ఈ సమయంలో మనం పెద్దగా ఆలోచించాలి, తెలివిగా పని చేయాలి, తగిన శ్రద్ధ చూపాలి. భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంటుంది—నేతలు, పాలసీ మేకర్లు, ఉపాధ్యాయులు, పౌరులు దీనిని కొత్తమార్గం వైపు నడిపించాలి. మార్పును అడ్డుకోవడం కాదు... దాని రూపకల్పనలో మనమంతా భాగస్వాములు కావాలి. కొత్త టెక్నాలజీకి భయపడకుండా దానిని మరింత సౌలభ్యంగా మార్చుకుందామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'ఈజ్ ఇండియా రెడీ ఫర్ అథెంటిక్ ఏఐ' నివేదికను మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. అనంతరం నారా లోకేష్ సమక్షంలో భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ, సీఐఐ వైస్ ప్రెసిడెంట్ సుచిత్ర కె.ఎల్లాతో సీఐఐ ఒప్పందం కుదుర్చుకుంది. వచ్చే ఐదేళ్లలో విజయవాడలో 30వేల మంది యువతకు ఉద్యోగ నైపుణ్య శిక్షణ, కెరియర్ కౌన్సిలింగ్, ఉద్యోగాల కల్పన కోసం ఈ ఎంవోయూ చేసుకోవడం జరిగింది. ఈ సదస్సులో సిఐఐ ప్రెసిడెంట్ రాజీవ్ మెమాని, నీతి ఫ్రంటైర్ టెక్ హబ్ చీఫ్ ఆర్కిటెక్ట్ దేబ్ జానీ ఘోష్, పోర్టులాన్స్ ఇనిస్టిట్యూట్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సౌమిత్ర దత్తా, వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండి జెరెమి జుర్గెన్స్, ఎర్నెస్ట్ అండ్ యంగ్ గ్లోబల్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ జోయ్ దేపా, కొరియా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ షారోన్ బూటీ తదితరులు పాల్గొన్నారు.

# నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న మండ్ల రామకృష్ణ,వేణుగోపాల్ రెడ్డి

**ముక్తల్,నవంబర్ 15(ప్రజాస్వరం):**

బాలాజీఇండస్ట్రీస్అధినేతబిలకంటిజానకి వైఫ్ ఆఫ్ బిల్లకంటి గోవర్ధన్ కూతురు నిశ్చితార్థంలో పాల్గొన్న ప్రముఖులు ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో రైస్ మిల్ గోపిశెట్టి కుమార్తె సౌమ్య-అఖిల్ నిశ్చితార్థ వేడుక బుధవారం జరిగింది. కార్యక్రమానికి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి,మాజీ మున్సిపల్ కౌన్సిలర్-బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మండ్ల రామకృష్ణ హాజరై నవ దంపతులకు ఆశీర్వాదాలు అందించారు. కార్యక్రమంలో కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

- **టీజిఈ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు**

**ఖమ్మం,నవంబర్ 15 (ప్రజాస్వరం):**

గ్రంథాలయాల ఆధునిక దేవాలయాలని పుస్తక పఠనంతో జ్ఞానభివృద్ధి సాధ్యమని తెలంగాణ ఉద్యోగుల సంఘం జేఏసీ ఏలూరు శ్రీనివాసరావు అన్నారు . జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొని ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాండగారాలని నిరుద్యోగులు ఎంతోమంది గ్రంథాలయంలో చదువుకొని ఉద్యోగాలు సాధించారని అన్నారు . గ్రంథాలయ వారోత్సవాలు సందర్బంగా రెండోవ రోజు పుస్తక ప్రదర్శన పోటీలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు,రాష్ట్ర కమిటీ కార్యదర్శి జైపాల్ జిల్లా,గ్రంథాలయ సంస్థ జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవిఎస్ఎల్ ఎన్ రాజు,సెక్రటరీ ఇమామ్,గ్రంథాలయ ఉద్యోగులు జె భాస్కరరావు,లలిత కుమారి , సిహెచ్ శ్రీనివాస్,భూక్యా బాబు,కే రవిబాబు తదితరులు పాల్గొన్నారు .



# సిటీ పోలీస్ కమిషనర్ శంకాబ్రతా బగ్చి స్థితి ప్రజ్ఞత పాత ముద్దాయిలను జల్లెడ పెడుతున్న అధ్యాయం.

- **ఆరు సంవత్సరాల తర్వాత మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గాంజా కేసులో ముద్దాయి పట్టివేత**
- **తప్పు చేసినవాడు చట్టం నుంచి తప్పించుకోలేడు - సిఐ గొలగాని అప్పారావు**

**గాజువాక,నవంబర్ 15(ప్రజాస్వరం):**




కోరమండల్ కర్మాగారంలో 2020 సంవత్సరం ఫిబ్రవరి నెలలో లారీ అన్లోడ్ చేస్తుండగా అందులో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడింది. ఆ ఘటనపై మల్కాపురం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. కానీ ముద్దాయి ఆ సమయంలో పోలీసులకు చిక్కకుండా ఉడాయించాడు. సుమారు 6 సంవత్సరాలు ఈ ఘటనలో ముద్దాయి పోలీసులకు దొరక్కుండా దాగుడుమూతలాడాడు. పోలీస్ కమిషనర్ శంకాబ్రతా బగ్చి సిటీలో బాధ్యతలు తర్వాత పాత కేసులు జల్లెడ పట్టే క్రమంలో రివ్యూ మీటింగ్లు ద్వారా సిబ్బందికి దిశా నిర్దేశించారు పాత కేసులు త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ క్రమంలో మల్కాపురం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గొలగాని అప్పారావు పర్యవేక్షణలో పాత ముద్దాయిలని పట్టే క్రమంలో ఒరిస్సా రాష్ట్రంలోనే సుమారు వారం రోజులు మాటు వేసి సాంకేతికత సాయంతో ముద్దాయిని పట్టుకోవడం జరిగిందని శనివారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో తెలిపారు. తప్పు చేసిన వ్యక్తి ఎన్ని సంవత్సరాల తర్వాత అయినా చట్టానికి సమాధానం చెప్పాల్సిందేనని ఈ ఘటనతో రుజువైంది అనడంలో సందేహం లేదు. అనంతరం ముద్దాయిని రిమాండ్ కి పంపించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి సిఐ గొలగాని అప్పారావు అభినందించారు. తప్పుచేసి తప్పించుకోవాలనుకునేవారు ఎక్కడున్నా చట్టానికి సమాధానం చెప్పాల్సిందేనని ఆయన కొనియాడారు. ముద్దాయి వివరాలు మరియు అతనిపై వర్తించే చట్టాలు ఈ కింద విధంగా ఉన్నాయి నేర సంఖ్య మరియు చట్టం యొక్క విభాగం: Cr.No.27/2020 U/s 20(b)(ii)(C) r/w 8(c), 25 of NDPS Act 1985. ముద్దాయి పేరు: బిజే కబాసి, S/o సానియా కబాసి, Age 37 Yrs, ఆదివాసీ కులం, R/o కరస్తాగూడ గ్రామం,కంవాడ, మల్కాన్గిరి జిల్లా,ఒడిషా రాష్ట్రం.

# గ్రంథాలయాలు అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- **ప్రొఫెసర్ సోమశేఖర్**

**విశాఖపట్నం,నవంబర్ 15(ప్రజాస్వరం):**

గ్రంథాలయం పాఠకులకు, ప్రజలకు చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యులు, ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ కే సోమశేఖర్ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని గ్రంథాలయ ఉద్యమ నేతల సంస్మరణ దినోత్సవంశనివారం అడివివరం గ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సోమశేఖర్ ముందుగా గ్రంథాలయ ఉద్యమ నేతలు అయ్యంకి వెంకట రమణయ్య గాడిచర్ల హరి సర్వోత్తమ రావు ఎస్సార్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజలగావించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా గ్రంథాలయాలను పాఠకులకు ప్రజలకు మరింత చేరువగా సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రంథాలయం అంటే ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండేలా వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకునేలా గ్రంథాలయాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు పాఠకులు కోరిన పుస్తకాలు వెంటనే గ్రంథాలయంలో లభించే విధంగా కృషి చేస్తామన్నారు. అందుకు తగిన సిబ్బంది కూడా అవసరం ఉందన్నారు. లైబ్రేరియన్ ఎన్వి నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మేఘాద్రిగడ్డ రెసిడెన్షియల్ స్కూల్ లైబ్రేరియన్ కె మాధవిలత, జిల్లా గ్రంథాలయ సంస్థ పింఛను దారులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి మల్లేశ్వరరావు ప్రధానోపాధ్యాయులు పి.బంగారు చిట్టి కార్మిక నాయకులు సి.హెచ్. ఎస్.ఎన్ రాజు,స్థానిక న్యాయవాది కె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతపురం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచనవ్యాసం వ్యాసం పోటీలు నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎల్లమ్మ టి పికే వర్మ, భుజంగరావు,చైతన్య,వర,మోక్ష, మహేంద్ర,మూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సోమశేఖర్ ను దుస్సలువా జ్ఞాపిక తో సత్కరించారు.



# నూతన వధువును ఆశీర్వదించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి.



**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 15(ప్రజాస్వరం):**

వనపర్తి పట్టణంలోని గాంధీ నగర్ కాలనీకి చెందిన సాక్షి రిపోర్టర్ గోర్ల రాజు మేనకోడలు వివాహ ప్రధాన కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరై ముందస్తు వివాహ శుభాకాంక్షలు తెలిపారు.అలాగే నూతన వధువు కుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగి ఆత్మీయంగా పలకరించారు. కార్యక్రమంలో సమన్వయకర్త లక్కాకుల సతీష్ కుమార్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చందర్, మాజీ కౌన్సిలర్స్ బాపనిపల్లి వెంకటేష్, పద్మ పరశురాం, చుక్క రాజు ,ఎన్ ఎస్ యు ఐ నేత శ్రీకాంత్,చిట్యాల రఘుపతి రావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధ్యార పోగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# మహాత్మా గాంధీ ఆశయ సాధనకు యువత ముందుకు రావాలి

- **ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి .**
- **స్వదేశీ వస్తు వినియోగం తోటే దేశ అభివృద్ధి - తుమ్మల యుగేందర్**

**ఖమ్మం,నవంబర్ 15 (ప్రజాస్వరం):**

స్థానిక భక్త రామదాస్ కళాక్షేత్రంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మరియు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వందే మాతరం@150 కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల యుగేందర్ పాల్గొన్నారు.రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్ మరియు గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షుడు సంజయ్ రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ 1156 విగ్రహాల ప్రదర్శన మరియు 156 చరకాల ప్రదర్శన నిర్వహించి , ఖమ్మం జిల్లా కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలను సత్కరించారు.అలాగే భారతదేశ స్వతంత్రం మరియు వందేమాతర గీతం విశిష్టతను తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు రామసయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ నేటి యువకులే రేపటి పౌరులు భారతదేశానికి అతి శక్తివంతమైన యువశక్తి ఉందని అన్నారు.యువత సరైన మార్గంలో మహాత్మా గాంధీ సూచించిన విధంగా సత్యం న్యాయం ధర్మం పాటిస్తూ చెడు అలవాట్లకు బానిసలు కాకుండా దేశ అభివృద్ధికి దోహదపడాలని యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ తన అభిప్రాయంలో ఈ దేశం నుండి బ్రిటిష్ వాళ్ళని పారితోలితే మనకు స్వతంత్రం వచ్చినట్టు కాదు వారు మనకి అలవర్చినటువంటి బ్రిటిష్ సంస్కృతిని ప్రారంభోలినాడే అసలైన భారత దేశ స్వతంత్రం వచ్చిందని తెలిపినట్టుగానే నేడు మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తు వినియోగించాలని పిలుపునిచ్చారు.అలాగే దేశ యువత నేడు పాశ్చాత్త కల్చర్ లో మగ్గుతూ మత్తుకు బానిస అవుతుందని అటువంటి చెడు అలవాట్లకి దూరంగా ఉంటూ దేశ అభివృద్ధికి సంస్కృతి సంప్రదాయాలకు పీఠం వేయాలని యువతకు పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ నాయకురాలు విజయబాయి , మహిళా సభ్యురాలు శ్రీ లక్ష్మి , గాంధీ సంస్థల చైర్మన్ దున్న రాజేందర్ రెడ్డి వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర కన్వీనర్ గాంధారి ప్రభాకర్,ఆర్గనైజేషన్ సెక్రటరీ మెరుగు మధు,ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్,పాలేరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిరణ్ కుమార్,వైరా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గరిడేపల్లి కిషోర్,సత్తుపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాథ్ , యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ అప్సర్,స్టేట్ సెక్రటరీ మదన్మోహన్,ప్రచారం కమిటీ చైర్మన్ మాజిద్ ఖాన్,గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మహిళా అధ్యక్షురాలు బొమ్మ ప్రవళిక , ఉపాధ్యక్షులు వెరమా రెడ్డి , సంతోష్ రెడ్డి,అడ్వైజర్ దయాకర్ రెడ్డి,అనిపర్తి శ్రీకాంత్,రాజ్ కుమార్,షేక్ ఖలీల్,మోత్కూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

# సోలిపూర్ రవికి మాతృవియోగం

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 15(ప్రజాస్వరం):**

ఖిల్లా గణపురం మండల మాజీ జెడ్పిటిసి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సోలిపూర్ రవి (తీనేటి రవీందర్ రెడ్డి) మాతృమూర్తి తీనేటి పద్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందారు.మండలంలోని సోలిపూర్ గ్రామానికి చెందిన ఆమె గత కొన్ని రోజులుగా హైదరాబాద్ లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఆదివారం సోలిపురం గ్రామంలో ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉంటూ ఆప్యాయంగా పలకరించే ఆమె ఇక లేరన్న విషయం




తెలుసుకొని గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరి వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరారు.

# వనపర్తికి త్వరలో మైనార్టీ మహిళ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల

- **వనపర్తికి త్వరలో మైనార్టీ మహిళ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల**
- **రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి చొరవ**

**వనపర్తి,నవంబర్ 15 (ప్రజాస్వరం):**

విద్యా రంగంలో వనపర్తిజిల్లా మరింత బలోపేతం కానున్నది. జిల్లా కేంద్రంలో మహిళ మైనార్టీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు దిశగా ప్రభుత్వ స్థాయిలో ప్రక్రియలు మొదలయ్యాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి స్వయంగా వెళ్లి రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి లేఖ రాశారు. ఈ లేఖలో వనపర్తిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న డిగ్రీ కళాశాలలు, మైనార్టీ డిగ్రీ కళాశాల లేని విషయాన్ని తెలుపుతూ, ఉన్నత విద్య కోసం మైనార్టీ మైనార్టీ విద్యార్థులు ఇతర జిల్లాలకు వలస వెళ్లాల్సి వస్తున్న దుస్థితిని వివరించి, వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ సెక్రటరీకి డాక్టర్ జి చిన్నారెడ్డి లేఖ రాశారు. దీనిపై వెంటనే స్పందించిన మైనార్టీ వెల్ఫేర్ సెక్రటరీ, వనపర్తిలో మైనార్టీ మహిళ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల స్థాపనకు సాధ్యాసాధ్యాలపై సవివర నివేదిక ఇవ్వాలని మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీకి ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వాల హయంలో వనపర్తి లో మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర, బాలికల పాఠశాలలు ఏర్పాటు చేశారు, ఆ పాఠశాలలు అనంతరం జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ అయ్యాయి. వీటిలో చదువుకున్న మైనార్టీ విద్యార్థులు డిగ్రీ కళాశాల లేకపోవడం వలన ఉన్నత విద్యకు దూరమయ్యారు. ఈ విషయాలపై డాక్టర్ జి చి న్నారెడ్డి దృష్టికి వెళ్ళగా ఆయన వెంటనే స్పందించి రెసిడెన్షియల్ మహిళ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని లేఖ రాశారు. “అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా డిగ్రీ విద్య...” *-డాక్టర్ జి చిన్నారెడ్డి వనపర్తిలో ఉన్నత విద్య అందరికీ అందుబాటులో ఉండేలా, ఆర్థికంగా వెనుకబడిన, మైనార్టీ వర్గాల విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ ప్రతిపాదనను



GOVERNMENT OF TELANGANA
MINORITIES WELFARE (EDN) DEPARTMENT

Memo.No.3267/EDN/2025-1 Dated:03.11.2025.

Sub:- M.W. Dept., - TMREIS – Request for Establishment of Degree Colleges for Minority women at Wanaparthy, Mahabubnagar Dist – Detailed report called for - Reg.

Ref:- From Dr. G.Chinna Reddy, Vice Chairman (Ex-Minister) Telangana State Planning Board, Govt. of Telangana, Lr No.902/0825, dtd:05.08.2025.

* * *

A copy of the reference cited is sent herewith to the Secretary, Telangana Minorities Residential Educational Institutions Society, Hyderabad. He is Requested to take necessary action in the matter.

B.PRASAD
DEPUTY SECRETARY TO GOVERNMENT

To
The Secretary, Telangana Minorities Residential Educational Institutions Society, Hyderabad (w.e)

Copy to :-
Dr. Chinna Reddy, Vice Chairman (Ex-Minister), Mahatma Jyothiba Phule, Praja Bhavan, Begumpet, Hyderbad – 500 016.
The PA to Secretary, Minorities Welfare Dept.,
S.f./S.c.

// FORWARDED : : BY ORDER //

SECTION OFFICER

ముందుకు తెచ్చినట్లు చిన్నారెడ్డి పేర్కొన్నారు. “డిగ్రీ స్థాయి నాణ్యమైన విద్య అందరికీ అందాలి. వనపర్తిలో మైనార్టీ రెసిడెన్షియల్ మహిళడిగ్రీ కాలేజ్ ఏర్పడితే అన్ని వర్గాల మహిళవిద్యార్థులు లాభపడి, జిల్లా విద్యావ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుంది” అని ఆయన అన్నారు. వనపర్తికి ఇది వరమవుతుందా? ఈ ప్రతిపాదన అమలైతే మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచిత, నాణ్యమైన డిగ్రీ విద్య వనపర్తిజిల్లాలో ఉన్నత విద్యా అవకాశాలు పెంపు ఇతర జిల్లాలకు విద్యార్థుల వలస తగ్గింపు ఉద్యోగావకాశాల పెరుగుదల స్థానికంగా విద్యావాతావరణం మరింత మెరుగుదల అనే ప్రయోజనాలు కలుగనున్నాయి. త్వరలో పచ్చజెండా? రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే శాఖలు స్పందించడం, సొసైటీకి నివేదిక కోరడం వంటి చర్యలు జరిగుండటంతో వనపర్తి ప్రజల్లో ఆశాభావం నెలకొంది.నివేదిక ఆధారంగా ప్రభుత్వం త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



# వయో వృద్ధులను హింసిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు

- **జిల్లా అదనపు కలెక్టర్ యాదయ్య**

**వనపర్తి,నవంబర్ 15(ప్రజాస్వరం):**

వయో వృద్ధులను ఎవరు హింసించినా కఠినంగా చట్టపరంగా శిక్షిస్తామని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యాదయ్య స్పష్టం చేశారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని సందర్భంగా శనివారం మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుంచి బాలుర కళాశాల మైదానం వరకు వాకథాన్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన అడిషనల్ కలెక్టర్ యాదయ్య, డీఎస్పీ వెంకటేశ్వరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదయ్య... వృద్ధులను నిర్లక్ష్యం చేయడం, హింసించడం చట్టపరంగా నేరమని, అలాంటి వాటిని సహించబోమని హెచ్చరించారు. యువత తమ తల్లిదండ్రులకు ప్రేమ, గౌరవం చూపించాలని, వృద్ధాప్యంలో వారికి అండగా నిలవాలని సూచించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతు"సీనియర్ సిటిజన్లపై జరిగే హింస,నిర్లక్ష్యంపై వెంటనే కేసులు నమోదు చేస్తాం. ఎవరైనా ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి" అని తెలిపారు.వయోవృద్ధుల రక్షణ,అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కే. సుధారాణి,వృద్ధుల సంఘాల ప్రతినిధులు,విద్యార్థులు, ఐసీడీఎస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ర్యాలీలో విద్యార్థుల నినాదాలు ,అవగాహన పోస్టర్లు ఆకట్టుకున్నాయి.






# రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవు

- **ధాన్యం లారీకి ఎత్తిన తర్వాత రైతుకు సంబంధం ఉండదు.**
- **మిల్లర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు.**
- **కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తిస్థాయి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి.**
- **ఎమ్మెల్యే మేఘారెడ్డి.**

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 15(ప్రజాస్వరం):**

వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి రైతుల ధాన్యాన్ని లారీల లోకి ఎత్తిన తర్వాత రైతులకు ఎలాంటి సంబంధం ఉండదని ఏం సమస్యలున్నా కొనుగోలు కేంద్రంలోనే పరిష్కరించి ధాన్యాన్ని తీసుకోవాలని మిల్లర్లతో రైతులకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని చెప్పారు. మిల్లర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి,మాజీ జెడ్పిటిసి సభ్యులు రమేష్ గౌడ్,మాజీ ఎంపీపీ రఘుప్రసాద్,తహసిల్దార్ పాండు నాయక్,ఎంపీడీవో పరిణత,ఏపీఎం సక్రు నాయక్, పామిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సిద్దయ్య,మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# వార్డు పర్యటనలో ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం

**విశాఖపట్నం,నవంబర్ 15(ప్రజాస్వరం):**

వార్డు పర్యటనలో భాగంగా పలు ప్రాంతాలను సందర్శించిన విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, స్థానిక 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ప్రజల నుంచి ప్రత్యక్షంగా సమస్యలను తెలుసుకున్నారు. అక్కడికక్కడే సంబంధిత ఏఈ, వర్క్ ఇన్స్పెక్టర్, జీవీఎంసీ సెక్రటరీలను సంప్రదించి, సమస్యల త్వరిత పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకునే విధంగా ముందుకు సాగారు.



# రైతులు తెచ్చిన ధాన్యంలో తాలు ఉంటే క్లీనర్ల ద్వారా తొలగించిన తర్వాతనే కొనుగోలు చేయాలి

- **కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**


**వనపర్తి,నవంబర్ 15 (ప్రజాస్వరం):**

రైతులు తెచ్చిన వరి ధాన్యంలో తాలు ఉంటే పూర్తిగా క్లీనర్ల ద్వారా తొలగించిన తర్వాతనే కొనుగోలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనుగోలు కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు. పెద్దగూడెం గ్రామంలోని ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తనిఖీ చేసి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యంలో తాలు ఉంటే క్లీనర్ల ద్వారా పూర్తిగా తొలగించిన తర్వాతే కొనుగోలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో జరిగే ప్రతి రిజిస్ట్రేషన్‌ను రైతులు తీసుకువచ్చిన ధాన్యం వివరాల ప్రకారమే నమోదు చేయాలని, ధాన్యంలో తేమ శాతాన్ని ప్రతిరోజూ పరీక్షించి రిజిస్టర్లలో నమోదు చేయాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేసి ,వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. మిల్లుల వద్ద కూడా ధాన్యం అన్లోడింగ్ వేగంగా జరిగేలా పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు డబ్బులు త్వరగా జమయ్యే విధంగా ట్రక్ షీట్ల ప్రాసెస్‌ను త్వరిత



గతిన పూర్తిచేయాలని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా,పాక్స్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు కూడా అదే కేంద్రంలో కొనుగోలు జరపడంతో ఐకెపి నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ గమనించారు. ఈ సమస్యను పరిష్కరించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల అధికారికి ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద సమగ్ర ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్,తహసీల్దార్ రమేష్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# దొంతన్ పల్లి గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన గండ్ర రవీందర్ రెడ్డి



**శంకర్ పల్లి,నవంబర్ 15(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా,శంకర్ పల్లి మండల పరిధిలోని దొంతన్ పల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గండ్ర రవీందర్ రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు వారాలుగుగా దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అన్నం పరబ్రహ్మ స్వరూపం ,ఒక్కో మెతుకు,బతుకును కోరుతుంది.ఆ విలువ తెలిసినవారు అన్నార్తుల ఆకలి తీర్చుతుంటారు. అన్ని దానాల కన్నా అన్న దానం ఎంతో విలువైనదని,శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీసులు అందరిపై ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో గండ్ర రవీందర్ రెడ్డి,గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్,ఆలయ నిర్వాహకులు,పూజారులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999